విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

గాంధీజీ మార్గమే ఈ దేశానికి శరణ్యం

జోడో మార్చ్ నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : గాంధీ మార్గమే ఈ దేశానికి శరణ్యమని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బి ఆర్ గౌస్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ వద్ద నుండి ట్రంక్ రోడ్డు అద్దంకి బస్టాండ్ మీదుగా గాంధీ రోడ్డులోని గాంధీజీ విగ్రహం వరకు భారత్ జోడో మార్చ్ నిర్వహించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా బిఆర్ గౌస్ మాట్లాడుతూ సత్యం అహింస ద్వారా దేనినైనా సాధించవచ్చు అని గాంధీజీ నిరూపించారని, అవే విషయాలను కొనసాగిస్తూ భారతదేశంలో పెట్రేగిపోతున్న హింసకు వ్యతిరేకంగా, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, మతాల పేరుతో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, భారత దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగానికి వ్యతిరేకంగా, రోజు రోజుకి పెరిగిపోతున్న ధరలకు వ్యతిరేకంగా, దేశ ప్రజల మధ్య ఐకమత్యం పెంపొందించాలన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి వైపు ఆలోచించే విధంగా రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడోయాత్ర గాంధీ సందేశాన్ని దేశానికి పంచిందని, ఈ దేశానికి ఎప్పటికీ గాంధీ మార్గమే అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి రాష్ట్ర కార్యదర్శులు ప్రవీణ్ రాజశేఖర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాయపాటి గిద్దయోను, గుత్తి రాజు, భరత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కే రసూల్ దండుప్రోలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందచేసిన సీఐ

సీఐ ఎం. రాజేష్ కుమార్

విశాలాంధ్ర-కంభం : కంభంలో సోమవారం సీఐ ఎం. రాజేష్ కుమార్ బేస్తవారి పేట పట్టణానికి చెందిన పర్సి పోగు.శ్యామ్‌కు ఎస్సై కోచింగ్ తీసుకునేందుకు సీఐ ఎం.రాజేష్ కుమార్ చేతుల మీదుగా రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. శ్యామ్ కుటుంబం ఆర్థికంగా వెనకబడి ఉన్న విషయం సీఐ రాజేష్ కుమార్ దృష్టికి రావడంతో గాంధీ జయంతిని రోజున పురస్కరించుకుని సర్కిల్ ఆఫీసులో నగదును అందజేశారు. ఇప్పటికే శ్యామ్ ఎస్సైగా ఉత్తీర్ణత సాధించాడు. ఈ నెల 14న ఫైనల్ పరీక్ష హాజరు కానున్నాడు. ఈ కార్యక్రమంలో కంభం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.మహబూబ్ బేగ్, సభ్యులు బీ.వీ.రామకృష్ణ, సయ్యద్. జాకీర్ హుస్సేన్, తన్నీరు.బాల రంగారావు, పులి.శ్రీనివాస ప్రసాద్, షేక్. అత్తార్ హుస్సేన్ (దాదా) గుండయ్య, రంగ, సోమయ్య, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు : లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటీజన్స్ వారి ఆధ్వర్యంలో గాంధీ జయంతి కార్యక్రమాలను ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. గాంధీ జయంతి సందర్భంగా క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో నగరంలోని నీరుపేద ఒంటరి మహిళలకు నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ లయన్ కూరపాటి రమేష్, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ అమృత శంకర్రావు, క్లబ్ సెక్రటరీ లయన్ సురేష్, క్లబ్ ట్రెజరర్ లయన్ పార్థసారథి, క్లబ్ పూర్వ అధ్యక్షులు పల్లపు సుబ్బయ్య, లయన్.తమ్మన ఆంజనేయులు ఎల్ ఎన్. పబ్బిశెట్టి జనార్ధన్, లయన్ తాత అశోక్, పాల్గొన్నారు.

మహాత్మ మన్నించు

విశాలాంధ్ర- ముండ్లమూరు : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంసం విక్రయాలు నిలిపి వేయాలని నిబంధనలు ఉన్నాయి. అయితే అందుకు విరుద్ధంగా మండలంలో మాంసం విక్రయాలు యదేచ్ఛగా నిర్వహించారు. అద్దంకి దర్శి ప్రధాన రహదారిలో ఉన్న మాంసం దుకాణాలు ఉన్నప్పటికీ మాంసం విక్రయాలు చేస్తున్నప్పటికీ అధికారులు పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం, దీంతో యదేచ్ఛగా మాంసం విక్రయాలను సాగించడం, వినియోగదారులు కూడా తీసుకు వెళ్లడం విశాలాంధ్ర విలేఖరి కంటపడింది. దీంతో పలువురు అహింసావాదులు మహాత్మా మన్నించు అంటూ నిట్టూర్చారు.

డ్వాక్రా సంఘాల మహిళలకు మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర- కొనకనమిట్ల : గాంధీ జయంతి పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు వైఎస్ఆర్ క్రాంతి పదం ప్రాజెక్టు డైరెక్టర్ టి రవి కుమార్ సూచనల మేరకు హరిత ప్రకాశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పలు గ్రామ పంచాయతీల డ్వాక్రా సంఘాల మహిళలకు వైయస్సార్ క్రాంతి పదం ఏపీఎం గోపాలకృష్ణ మొక్కలు పంపిణీ చేసి వారి చేత నాటించారు ఒక్కొక్క పంచాయతీకి 100 మొక్కలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎంమాట్లాడుతూ మొక్కలు తీసుకున్న మహిళ సభ్యులందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు కొనకనమిట్లలో సీసీలు వేల్పుల ఎజ్రా, రామయ్య వద్దిమడుగులో రాజయ్యలు మొక్కలు నాటించగా ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వివోఏలు గ్రామ సంఘాల సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు.



విశాలాంధ్ర -పెద్ద దోర్నాల : మండల కేంద్రమైన దోర్నాల్లోని స్థానిక నట్రాజ్ సెంటర్ వద్ద గాంధీజీ జయంతి సందర్భంగా సోమవారం ఎంపీపీ భర్త గుమ పద్మ జాయల్లేష్, మొగిలి గుప్త, గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తంగిరాల రామిరెడ్డి, లాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండ్ల తోటల వైపు దృష్టి సారించాలి

విశాలాంధ్ర- ముండ్లమూరు : ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా అందిస్తున్న పండ్ల మొక్కలు పెంచుకొని తద్వారా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో ఎన్ వి ఎల్ హనుమంతరావు అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో ఉన్న పంట కాలువలలో, చెరువులలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల వద్ద భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతలు తీయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పండ్ల మొక్కలు నాటి పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తేలుకుట్ల బ్రహ్మయ్య, ఉపాధి ఈసీ ఎం ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మె జయప్రదం చేయాలి

విశాలాంధ్ర కనిగిరి : గ్రామీణ తపాలా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందిని డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఎనిమిది గంటల పని విధానం అమలు చేసి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ పిలుపు

సోమవారం కనిగిరి దర్శి చెంచయ్య భవన్‌లో ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నాయకుల సమావేశం జరిగింది. ఆ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. తపాల ఉద్యోగులు ఇప్పటికే దశల వారిగా ఆందోళన చేపట్టినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని చాలీచాలని జీతాలతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 140 సంవత్సరాల చరిత్ర కలిగిన తపాలా శాఖలో ఉద్యోగులకు పెన్షన్ గ్రాడ్యుటీ, ఆరోగ్య భీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ రాష్ట్ర సహాయక కార్యదర్శి కెబీ మీరావలి మాట్లాడుతూ సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12 24 36 సంవత్సరాల సర్వీస్ కు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ గ్రాడ్యుటీ 5 లక్షలకు పెంచాలని ఫెయిల్ లీవ్లను 140 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని కోరారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసు చేసిన బంచింగ్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కనిగిరి నియోజకవర్గ అధ్యక్షులు గుజ్జుల బాలిరెడ్డి ,ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ డివిజన్ నాయకులు పెన్నా రమణయ్య, ఎస్ తిరుపతి రెడ్డి, పీవీ కొండయ్య పాల్గొన్నారు.

మహిళల వద్దపది మద్యం బాటిల్ స్వాధీనం

విశాలాంధ్ర- సింగరాయకొండ గాంధీ జయంతి సందర్భంగా ఎలాంటి బెల్ట్ షాపులు అక్రమ మద్య రవాణా జరగకుండా సింగరాయకొండ ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా కలికివాయి ఫ్లైఓవర్ వద్ద తానికొండ విజయలక్ష్మి అనే మహిళను అనుమానం రావడంతో ఆమెను మహిళా పోలీసుల ద్వారా పట్టుకొని విచారించగా ముందు రోజు మద్యం షాపులలో 10 మద్యం బాటిల్లుకొనుగోలు చేసుకుని గాంధీ జయంతి రోజు అధిక మొత్తంలో అమ్ముకోవటానికి ఉన్నానని తెలిపింది. గతంలో కూడా మద్యం కేసులు ఉన్నాయని ఆమెను రిమాండ్ నిమిత్తం కందుకూరు కోర్టుకు హాజరు పరచడమైనది. ఏఎస్ఐ భాష తెలిపారు.

సొసైటీ మాటున ల్యాండ్ మాఫియా

సమావేశం లో మాట్లాడుతున్న కో సొసైటి సభ్యులు.

విశాలాంధ్ర దర్శి :- దర్శి నగర పంచాయతీ ఆటోమోల్ టెక్నీషియన్ వర్కర్స్ కో ఆపరేటివ్ సొసైటీ లొ సభ్యులుగా ఉన్న కొంతమందికి తమ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సిద్ధమవుతుండగా, కొంతమంది రిజిస్ట్రేషన్ చేయనీయకుండా అడ్డుకుంటున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆటోమోల్ టెక్నీషియన్ వర్కర్స్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వెన్నపూస నర్సారెడ్డి కోరారు. దర్శి అద్దంకి రోడ్డులోని వెన్నపూస నరసారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సొసైటీ మాటున ల్యాండ్ మాఫియా దాగి ఉందన్నారు.నర్సారెడ్డి మాట్లాడుతూ 1996 వరకు దీనిని అసోసియేషన్ గా ఏర్పాటు చేశారని, ఈ అసోసియేషన్ 1997 నుండి ఆటోమొబైల్ టెక్నీషియన్ వర్కర్స్ కో ఆపరేటివ్ సొసైటీ గా రిజిస్ట్రేషన్ చేసి, ఈ సొసైటీ కి అధ్యక్ష కార్యదర్శులుగా స్వర్గీయ ఈడుపు గంటిసత్యనారాయణ, నాయబ్ రసూల్ ను ఎన్నుకోవడం జరిగిందనిఅన్నారు. అప్పటినుండి సొసైటీలో ఎన్నో అవకతవకలు జరుగుతు న్నాయని ఆయన ఆరోపించారు. ఈ కోఆపరేటివ్ సొసైటీలో సమావేశంలో తీర్మానించకుండా కొత్తవారిని చేర్చుకోవటం, పాత వాళ్ళని తొలగించడం జరుగుతుందన్నని, మృతి చెందిన వారి పేర్ల మీద సమావేశంలో హాజరైనట్టుగ ఫోర్జరీ సంతకాలు పెట్టి హాజరైనట్టుగా రిజిస్టర్ లో రాయడం, జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మృతి చెందిన వారు సమావేశానికి ఏ విధంగా వచ్చి సంతకాలు పెట్టారని ఆయన ఆరోపించారు. వారి ఆత్మలు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించారు. గతంలో హైకోర్టును ఆశ్రయిం చడం జరిగి ందని, 99 మంది సభ్యులకు మాత్రమే ఈ సొసైటీకి అర్హు లని, వారుమాత్రమే రిజిస్ట్రేషన్ కుఅర్హత ఉందని కోర్టు తీర్పు ఇచ్చిందని, ఆయన తెలిపారు. వీరిలో 36 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేపించు కున్నారని, మిగిలిన వారు రిజిస్ట్రేషన్ చేపించుకుం టుంటే, 9 మంది సభ్యులు అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై కోర్టు ఆశ్రయించడం జరిగిందని, ఆయన తెలిపారు విలేక రుల సమావేశంలో అరిగేల పట్టాభి, బి బాలకోటయ్య, ఏ, నాగూర్, సిహెచ్ జీవన్ బాబు,ఎస్ కే, బాబు, డి రమణయ్య, బి.సంపత్, జి శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్ వెంకట నరసింహారావు, జి రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం అభివృద్ధి

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర- హనుమంతునిపాడు: మెనీ ఫెస్టోలో పొందుపరిచిన హామీలతో పాటు ప్రజల కష్టాలు తెలుసుకొని వాటిని నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. సోమవారం హను మంతునిపాడు మండల పరిధిలోని లింగం గుంట గ్రామంలో సచివాలయం ప్రారంభించి అనంతరం గాయంవారిపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకునే సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల పుస్తకా లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్ర మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుం దని అలానే వైసీపీ ప్రభు త్వంలో ముఖ్యమంత్రి జగనన్న ఎలాంటి తారతమ్యాలు లేకుండా కులమతాలు పార్టీలకతీతంగా ప్రతి గడపలో అర్హులందరకు వాలంటీర్ల ద్వారా పథకాలు అందు తున్నాయన్నారు. అలాగే నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైసీపీని గెలిపిం చాలని ప్రజలను కోరారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ గాయం సావిత్రి,మాజీ ఎంపీపీ గాయం బల రామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసులురెడ్డి,సర్పంచ్ భవసం కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇన్చార్జ్ కస్తాల బాలాజీ,మండల మహిళా అధ్యక్షు రాలు కస్తాల బేబీ,వైస్ ఎంపీపీ శోభ, ఆదినారా యణ రెడ్డి, తదితర వైసీపీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్వరాజ్యం నిజం చేసిన మహానీయుడు

విశాలాంధ్ర- ముండ్లమూరు : స్వరాజ్య కలను నిజం చేసిన మహనీయుడు మహాత్మా గాంధీజీ అని సర్పంచ్ కూర పాటి మహేశ్వరి నారాయణస్వామి అన్నారు. మండలంలోని శంకరాపురం, ముండ్లమూరు, నూజిలపల్లి, గ్రామాలలోని సోమవారం సచివాలయాలు, రామాలయం వద్ద గాంధీజీ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒక సామాన్యమైన వ్యక్తిగా ఉంటూ భారతదేశానికి గుర్తింపు తెచ్చిన మహనీయుడు గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.కె మౌలాలి, ఆర్ బి కే వి ఏ ఏ కృష్ణారెడ్డి,పమిడి హనుమంతరావు, మేడికొండ పూర్ణాంజనేయులు, మందలపు రాంబాబు, మందలపు అజయ్, జాష్టి వెంకటేశ్వర్లు. మహిళా సంరక్షణ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకం చేపట్టి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పచ్చదనాన్ని పరిరక్షించాలని ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానంద రెడ్డి అన్నారు. మండలంలోని నూజిల్లపల్లి గ్రామంలో సోమవారం గాంధీ జయంతి సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలంటే పచ్చదనం ప్రాధాన్యతను వివరించారు. ఎంపీడీవో ఎన్ వి ఎల్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో విరివిగా మొక్కలు పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చొప్పరపు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ తేలుకుట్ల బ్రహ్మయ్య. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్ముని జన్మదిన వేడుకలు

దొనకొండలో మట్టి, ధాన్యపు కళశాలతో ఎంపీపీ, సర్పంచ్, తహసీల్దార్ తదితరులు

విశాలాంధ్ర- దొనకొండ: స్థానిక రైల్వే ఆవరణలో గల మహాత్మ గాంధీ విగ్రహానికి ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, మేజర్ పంచాయతీ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్న దేవానంద్, తహసీల్దార్ యం.సువర్ణ, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేరా దేశ్-మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా ధాన్యం, మట్టిని కళశాల్లో నింపి గాంధీ విగ్రహానికి ముందు పెట్టి ప్రత్యేక పూజలు చేసి, బస్టాండ్ సెంటర్‌లో మేళ తాళాలతో ఘనంగా వాటిని ఊరేగించారు. గంగదేవిపల్లిలో సచివాలయంలో సర్పంచ్ ఎగ్గోని కుమారి, ఉప సర్పంచ్ కర్నాటి ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రసూల్‌బాషా, ఎంపీటీసీలు గుంటు అజయ్, కోఆప్షన్ షేక్.గఫార్, కార్యదర్శి క్రిష్ణమూర్తి, మాజీ ఎంపీపీ ఆదిమూలపు ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పీసీపల్లి : మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సత్యాగ్రహమే ఆయుధంగా దేశానికి స్వరాజ్యం ఇచ్చిన మహాత్మా గాంధీజీని ఎన్నడూ మర్చిపోలేమని ఆయన అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని తెలిపారు అనంతరం గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలుచోట్ల కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

కంభంలో గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కంభం: కంభం పట్టణంలో సోమవారం ఎంపీపీ చేగిరెడి తులశమ్మ ఆధ్వర్యంలో జాతి పిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని, కంభం ఎంపీడీవో కార్యలయంలోని సమావేశ హాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చేగిరెడ్డి.తులసమ్మ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ స్మరించుకొని ఆయన అడుగుజాడలే మనందరికీ ఆదర్శమని ఆయన అడుగు జాడలలో నడవాలని,గాంధీజి ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలని, తోటి వారిని గౌరవించాలని, గాంధీజీ బోధనలు నవసమజానికి నిర్మాణానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ సభ్యులు

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రధాన కూడలిలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ దేశానికి స్వతంత్రం రావటానికి ఆయన చేసిన సేవలు గురించి కొనియాడారు. అనంతరం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉర్దూ పాఠశాలలో మొక్కలు నాటారు వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు వివి రమణ రావు మాజీ అధ్యక్షులు జెబీ రామారావు పోలేపల్లి అనంతా లక్ష్మీనారాయణ సూరే నాసరయ్య గుప్తా కొత్త అయ్యప్ప శెట్టి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కదిరి బాబురావు విద్యాసంస్థలలో గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-సిఎస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ మరియు ఉద్యాన కళాశాలలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలల డీన్స్ డాక్టర్ సున్నా త్రిమూర్తులు, డాక్టర్ పి వీరన్న గౌడ్ లు కళాశాల సిబ్బందితో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన సమరయోధుల్లో మోహన్ దాస్ కరంచంద్ గాంధీ అగ్రగణ్యులు, సత్యం, అహింసలే అయన నమ్మే సిద్ధాంతాలు అని అన్నారు. అహింస పద్ధతిలో సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి ఎన్నో ఉద్యమాలను అయన తన ఆయుధాలుగా చేసుకొని స్వాతంత్ర్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. అందుకు దేశప్రజలందరూ ఆయనను జాతిపిత మహాత్ముడు అని పిలుచుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుని పాదయాత్రకు నేతల సంఘీభావం

విశాలాంధ్ర- పెద్ద దోర్నాల : ఒకవృద్ధుడు నంద్యాల నుండి రాజమండ్రి వరకు బాబుతో నేను వారికి తోడు అని పాదయాత్ర చేస్తూ, సోమవారం దోర్నాల మండలానికి చేరిన సందర్భంగా వారితో కలిసి సంఘీభావం తెలిపారు.బండి ఆత్మకూరు మండలం చిన్నదేవులాపురం గ్రామానికి చెందిన చింతల నారాయణ 70 సంవత్సరాలు అనే వృద్ధుడు, చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా, రాజమండ్రి వరకు బాబుతో నేను అంటూ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, అతనికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో, బట్టుసుధాకర్ రెడ్డి, రావి క్రింది సుబ్బా రాత్నం, దేసు నాగేంద్రబాబు, షేక్ రఫీ, పటాన్ ఖాన్, తదితర టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు.

మహాత్ముని ఆశయాలు కొనసాగిద్దాం

విశాలాంధ్ర-ఒంగోలు : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అమ్మనబ్రోలు సచివాలయ పరిధిలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఏపీ ఆరోగ్య శ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు పూలమాలవేసి, ఘన నివాళులర్పించారు. డాక్టర్ యాదాల అశోక్ బాబు మాట్లాడుతూ మహాత్ముని ఆశయాల కొనసాగించేందుకు ప్రతి ఒక్క యువత ముందుకు రావాలని, భారతదేశానికి స్వాతంత్రం తీసుకొచ్చేందుకు ఉప్పు సత్యాగ్రహం లాంటి దీక్షలు చేపట్టి తెల్లవారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వ్యక్తి మహాత్మా గాంధీ అని అశోక్ బాబు అన్నారు.నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహాత్మా గాంధీ ఆశయ సాధనలో భాగంగా గ్రామ స్వరాజ్యం అనే సిద్ధాంతంతో గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇంటి ముందుకి గ్రామ పరిపాలన, గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారని అన్నారు. యువత దేశానికి పట్టు కొమ్మలు అన్న మహాత్మా గాంధీ సిద్ధాంతాన్ని యువకులంతా అందిపుచ్చుకొని దేశ అభివృద్ధి కొరకు తోడ్పడాలని తెలిపారు.

రాష్ట్రంలో కక్ష సాధింపు పాలన

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన చేస్తూ, రాజకీయ కక్ష సాధింపు చర్యకు పాల్పడుతుందని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులను వ్యతిరేకిస్తూ సోమవారం యర్రగొండపాలెంలో గాంధీ జయంతి సందర్భంగా సత్యమేవ జయతే నిరాహారదీక్ష చేపట్టారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిబిరంలో ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా సంక్షేమ పాలన అందించిన చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో అందరికీ మేలు చేసే ఆర్యవైశ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉంటేనే ఆర్యవైశ్యులకు రక్షణ అన్నారు. న్యాయస్థానాలైన చంద్రబాబు నిజాయితీని గుర్తించి కేసులను కొట్టివేయాలన్నారు. రాచక పాలనను అంతమొందించాలంటే 2024లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహమే ఆయుధంగా స్వరాజ్యం సాధించిన ఘనులు గాంధీజీ



విశాలాంధ్ర- తాళ్లూరు:- సత్యాగ్రహమే ఆయుధంగా దేశానికి స్వరాజ్యం తెచ్చిన ఘనత మహాత్మా గాంధీజీ ది అని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పిటిసి మారం వెంకట్ రెడ్డిలు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి గాంధీజీకి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులు ఐ వెంకటేశ్వర్ రెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జున రెడ్డి, డి ఆర్ డి ఏ పి డి, మండల కో ఆప్షన్ సభ్యులు కరీముల్లా, తాళ్లూ రు సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, మండల పరిషత్ కార్యాలయ ఎస్ఓ శ్రీని వాసరావు, ఎంఈఓ జి సుబ్బయ్య, రజానగరం సర్పంచ్ కాలేశా వలి, వైసీపీ నాయకులు విష్ణు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు, ఏపీఎం, సిబ్బంది పాల్గొన్నారు. బెల్లంకొండ వారి పాలెం సర్పంచ్ పి సుమలత శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ గూడ సరస్వతీ ప్రభాకర్ రెడ్డి, గాంధీజీ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. బొద్ది కూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్ అంజిరెడ్డి, విశ్రాంత ఉద్యో గులు ఎస్ యోగి రెడ్డి, ఉపాధ్యాయులు పి సుబ్బారెడ్డి, విద్యార్థులు, గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల బీజేపీ అధ్యక్షులు అనుముల కోటేశ్వర రావు ఆధ్వర్యంలో నాయకులు సుబ్బారెడ్డి, చినపుల్లారావు, శ్రీనివాసరా వులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు.

మీడియా రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

- అర్హులైన జర్నలిస్ట్ లందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి.
- కొవిడ్ సమయంలో మృతి చెందిన జర్నలిస్ట్ కుటుంబాలను ఆదుకోవాలి.
- ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎస్ వి రమణ డిమాండ్.

విశాలాంధ్ర-మార్కాపురం: దేశంలో మీడియా వ్యవస్థపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు, పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు మీడియా రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎస్ వి రమణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవ్ జర్నలిజం కోరుతూ అలాగే మీడియాపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ... మీడియా రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) పిలుపుమేరకు స్థానిక ఏపీయుడబ్ల్యూజే శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ వి. రమణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మీడియా, పత్రిక స్వేచ్ఛపై దాడులు రోజురోజుకు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. --ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా చెప్పబడుతున్న మీడియాపై అనాగరిక పద్ధతులలో దాడులు జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను నివారించాలన్న, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించబడాలన్న మీడియా రక్షణ చట్టం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని దేశంలోని ప్రముఖ మేధావి వర్గం,న్యాయవాదులు, సెక్యులర్ వాదులు గుర్తించారని అన్నారు. కోవిడ్ సమయంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టు కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం ఆర్థిక సహకారం అందించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు రూ 5 లక్షల ఎక్స్గ్రేషియా అందిస్తామని ఏపి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని, అయితే ఆచరణలో నేటికీ ఏ ఒక్కరికి కూడా రూపాయి ఇవ్వలేదని అన్నారు.గతంలో ఎన్నడు లేని విధంగా అక్రిడేషన్ల మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు విధిస్తుందని,దీంతో జర్నలిస్టులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో జర్నలిస్టు వృత్తిలో 25 వేలకు మందికి పైగా కొనసాగుతున్నారని, కావున వీరందరికీ భేషరతుగా అక్రిడేషన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మెడిక్లైమ్ పాలసీలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలంటే ఆన్లైన్లో ఎప్పుడు చూసినా సర్వర్ బిజీ వస్తుందని, దీంతో దరఖాస్తు కూడా చేసుకోలేక చాలామంది ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పటికయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, లేనిచో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఏపీయుడబ్ల్యూజే నాయకులు ఎన్వి రమణ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జర్నలిస్టులు స్థానిక ప్రెస్ క్లబ్ నుండి పాత బస్టాండ్ లోని గాంధీ పార్క్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.వి సత్యనారాయణ, బివి సుబ్బారావు, డి.బాబి, ఎస్ కె .బాజీవలి, ఎస్.కె అబ్దుల్ రజాక్, ఎస్.కె అన్ను, అది నారాయణ, నరేంద్ర, ఎస్ కె . రఫీ, వి. సుదర్శన్, ఎస్.కె. కరీం , కృష్ణారెడ్డి, రాజ్ కమల్, ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శులు బి. సురేష్, ఏ శ్రీనివాసరావు, యూనియన్ సభ్యులు అంకయ్య, శ్రీకాంత్ ,ఎస్ కె షౌకత్, ఎస్ కె అన్వర్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఉద్యయాదవ మహా సభను జయప్రదం చేయండి

ఉద్యయాదవ్ మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

విశాలాంధ్ర- పెద్ద దోర్నాల : తెలంగాణ హైదరాబాద్ నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాల్ నందు ఈనెల 8వ తారీఖున ఆదివారం రోజున ఉద్య ఫౌండర్ మేకల చంద్రశేఖర్ యాదవ్, మరియు మేక లలిత యాదవ్, సారథ్యంలో నిర్వహించే ఉద్య యాదవ మహాసభకు ప్రతి ఒక్క యాదవ సోదర, సోదరీమణులందరూ వచ్చి జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాము. ఈ యాదవ మహాసభకు ముఖ్య అతిథులుగా ఆలిండియా ఓ బి సి ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కిరణ్ యాదవ్ తమిళనాడు యాదవ మహాసభ అధ్యక్షులు జె రామచంద్రన్ యాదవ్, మాజీ టీటీడీచైర్మన్,మాజీ ఏపీబిసీ చైర్మన్ డాక్టర్ పి కృష్ణయ్య యాదవ్, బిపి మండల్ యాదవ్ గారి మనుమడు బి.పి సూరజ్ మండల్ యాదవ్ (ప్రొఫెసర్ ఆఫ్ ఢిల్లీ యూనివర్సిటీ), ఆలా హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు యాదవ్, ద్రావిడ దేశం అధ్యక్షులు ఒంటేరు కృష్ణారావు యాదవ్ విచ్చేస్తున్నారు. వీరితో పాటు యాదవ సంఘం నాయకులు, ఇరు రాష్ట్రాల ఉద్య కుటుంబ సభ్యులు, కోర్ కమిటీ సభ్యులు, ఉద్య జాతీయ యువజన నాయకులు, ఉద్య రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జులు, ఉద్యగౌరవ సలహాదారులు పాల్గొంటున్నారని తెలిపారు.

మహిళా శక్తితో వైసీపీ భూస్థాపితం

- వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేదు
- గాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన ముత్తుముల

విశాలాంధ్ర గిద్దలూరు: రాష్ట్రంలో వైసీపీని భూస్థాపితం చేయాలంటే మహిళా శక్తితోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా 20 వ రోజు సోమవారం మహిళలతో ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు.గాంధీ జయంతి సందర్భంగా దీక్షా శిబిరం వద్ద టీడీపీ ఇంచార్జ్ అశోక్ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని రోజుకొక హత్య పూటకొక హత్యాయత్నం జరుగుతుందని, మహిళల రక్షణ కోసం ఆడంబరంగా ప్రవేశపెట్టిన దిశా చట్టం ఊసే లేదన్నారు.జగన్ రెడ్డి మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, రాష్ట్రంలో చంద్రబాబు పై వైసీపీ చేస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్యల పై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు మహిళాలోకం సిద్ధంగా ఉన్నారన్నారు.రిలే నిరాహార దీక్షలలో పాల్గోన్న మహిళలు రాజమండ్రి సెంట్రల్ జైలు లో ఉన్న బాబుకు పోస్ట్ కార్డు వ్రాసి తమ మద్దతు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట మహాలక్ష్మి,ఉపాధ్యక్షురాలు కత్తి విజయభారతి,పార్లమెంట్ వాల్మీకి సాధికార సమితి కన్వీనర్ నల్లబోతుల రమాదేవి,అంగన్వాడీ సంఘం నాయకురాలు బొంతా లక్ష్మిదేవి, 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి,సయ్యద్ రహమత్ బి,చిటికెన లలిత,వేనమ్మ,షేక్ ఫాతిమా,వెళుతుర్ల మల్లీశ్వరమ్మ,కోటేశ్వరమ్మ, బొడ్డు సుశీలమ్మ మహిళా కార్యకర్తలు,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ

విశాలాంధ్ర - మార్కాపురం : మానవ మహోపకారి ముహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసం పురస్కరించుకుని "ప్రవక్త ముహమ్మద్(స) యువతరానికి స్ఫూర్తి" అనే నినాదంతో ఐడియల్ యూత్ మూవ్ మెంట్ (ఐ.వై.ఎం) సంస్థ సెప్టెంబర్ 21 నుండి 30 వరకు పది రోజుల పాటు రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా మార్కాపురం పట్టణానికి విచ్చేసిన ఐ.వై.ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ హుస్సేన్ స్థానిక ప్రకాశం ఐ.వై.ఎం భాద్యులు, కార్యకర్తలతో ప్రెస్ క్లబ్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి యువత ఆదర్శంగా నిలవాలని , ఐ.వై.ఎం ఆ దిశగా అహర్నిశలు శ్రమిస్తోందని అన్నారు. ఉద్యమ సందర్భంగా స్థానిక స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ లో మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది. పట్టణ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ సమాజ సేవల్లో యువకులు ముందు ఉండాలని, దేశ ప్రగతిలో యువకులు భాగస్వామ్యం కావాలని తెలిపారు.ఐ.వై.ఎం రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ మాట్లాడుతూ మానవ మహోపకారి ముహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర ప్రపంచ మానవాళికి ఆదర్శమని,రాష్ట్ర వ్యాప్తంగా ముహమ్మద్ ప్రవక్త వారి బోధనలు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఐ.వై.ఎం ధార్మిక కార్యక్రమాలు మరియు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథి జమాతే ఇస్లామి హింద్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు అష్రఫ్ అలీ మాట్లాడుతూ యువకులకు దిశా నిర్దేశం చేయడానికి ఐ.వై.ఎం నడుం బిగించడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమం లో ఐ.వై.ఎం డిస్ట్రిక్ట్ ఆర్గనైజర్ తలహా, కార్యదర్శి రసూల్, ఎస్ఐఓ యూనిట్ ప్రెసిడెంట్ ఖాలీద్ మరియు జమాత్ బాధ్యులు కార్యకర్తలు, ఐ.వై.ఎం, ఎస్ఐఓ సభ్యులు పాల్గొన్నారు

డీసీసీలో మహాత్మా గాంధీ జయంతి

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీపతి సతీష్ మాట్లాడుతూ స్వర్గీయ మహాత్మా గాంధీ అహింస,శాంతి సన్మార్గంతో బ్రిటిష్ పాలన నుండి భారతదేశానికి స్వతంత్రం తీసుకువచ్చి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి షేక్ సైదా మాట్లాడుతూ మహాత్మా గాంధీ లాంటి అహింస వాది ఈ ప్రపంచంలో ఎవరూ లేరు అన్నారు. నాటి గాంధీ య వాదం నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో మచ్చుకైనా లేదు అని ఎద్దేవా చేశారు.రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు వద్దండి మల్లికార్జున్ మాట్లాడుతూ గాంధీ వాదంలో అహింస ఉండేదని ఇప్పుడు మణిపూర్‌లో జరుగుతున్నది హింస మాత్రమే నని ఇలాంటి రోజులు పోవాలనిఅన్నారు. డిసిసి ఉపాధ్యక్షులు ఎస్.కె రసూల్,జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు ఉంగరాల శ్రీనివాసరావు, ఒంగోలు మండల అధ్యక్షులు తెలగపూడి బుజ్జి, కందుకూరు అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సుమన్, ఎన్ఎస్యు ఐ నాయకులు రఫీ ఉల్లా, ప్రేమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

విశాలాంధ్ర ఒంగోలు : వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ సత్ప్రవర్తనతో సాగిన మహాత్మ గాంధీజీ జీవితం మనందరికీ ఆదర్శనీయమని జిల్లా ప్రిన్సిపల్ జడ్జ్ శ్రీమతి ఏ.భారతి అన్నారు. గాంధీజీ 154వ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా జైలులో నిర్వహించిన ' ఖైదీల సంక్షేమ దిన ' కార్యక్రమంలో కలెక్టర్ శ్రీ.ఏ.ఎస్.దినేష్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ.కె. శ్యాంబాబు, ఏ.ఎస్.పి. శ్రీధర్ బాబు, రాష్ట్ర బాల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు శ్రీమతి బత్తుల పద్మావతితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహనం, క్షమాగుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, కోపాన్ని నియంత్రించుకుంటే సమాజంలో నేర సంఘటనలు జరగకుండా ఉంటాయని అన్నారు. తప్పు చేయకూడదు అన్న గాంధీజీ ఆలోచన స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. క్షణికావేశంలో నేరానికి పాల్పడితే జైలుకు శిక్ష అనుభవిస్తూ కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుందని అన్నారు. అంతమాత్రాన జీవితం ముగిసిపోలేదని, ప్రవర్తన మార్చుకుని జైల్లో పరివర్తన పొంది బాధ్యత గల పౌరులుగా బయటకు వెళ్లాలని ఆమె చెప్పారు. ప్రభుత్వాలు కూడా ఈ దిశగా చట్టాలు చేస్తున్నాయని, జైళ్లు కేవలం కారాగారాలుగానే కాకుండా ఖైదీలలో వృత్తిపరమైన నైపుణ్యం పెంచే కర్మాగారాలు తీర్చిదిద్దుతున్నాయని అన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఆవేశంలో నేరానికి పాల్పడినా ఆత్మ పరిశీలన చేసుకొని జీవితాలను సరి చేసుకోవడానికి ప్రయత్నించాలని ఖైదీలకు సూచించారు. జైలు శిక్ష పూర్తి చేసుకుని బయటకు వెళ్లిన తర్వాత బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించడానికి, వివిధ ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం తరఫు నుంచి అందిస్తామని చెప్పారు. నాటికీ, నేటికీ గాంధీజీ చూపిన అహింసా వాదమే అందరికీ ఆచరణీయమని అన్నారు. ఏఎస్పి శ్రీధర్ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర సమయంలో గాంధీజీ జైలు జీవితం గడిపారని, ఆయన జయంతిని పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినంగా పాటిస్తున్నామని చెప్పారు. జైలును కేవలం శిక్షాలయంగా కాకుండా శిక్షణాలయంగా మారుస్తున్నామని అన్నారు. నేర చరిత జీవితాలను మరచిపోయి, శిక్షాకాలం ముగిశాక సంస్కరణ వాదిగా బయటకు వెళ్లి బాధ్యతాయుతంగా జీవించాలని ఖైదీలకు ఆయన సూచించారు. డి.ఎల్.ఎస్.ఎ.కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతూ విచారణలో ఉన్న ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. వ్యక్తిగతంగా ప్రైవేటు లాయర్ ను నియమించుకొనే అవకాశం లేని వారికి తాము సహాయం చేస్తామన్నారు. అంతేకాకుండా ప్రైవేటు లాయర్ ను నియమించుకుని ఆర్థికంగా చాలామంది నష్టపోతున్నారని, వారికి సరైన అవగాహన లేకపోవడం వలనే ఇలా చేస్తున్నారని చెప్పారు. ఖైదీలందరికీ అవసరమైన న్యాయ సహాయం తాము చేస్తామని ప్రకటించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తామని చెప్పారు. బత్తుల పద్మావతి మాట్లాడుతూ జైలులో ఉన్న ఖైదీల పిల్లల సంరక్షణకు అవసరమైన చర్యలను తాము చేపడుతున్నట్లు చెప్పారు. వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు అందేలా చూస్తున్నామన్నారు. బిడ్డలకు, కుటుంబ సభ్యులకు దూరమయ్యేలా చేస్తున్న నేరాలకు పాల్పడకుండా నిగ్రహం పాటించాలని ఖైదీలకు ఆమె సూచించారు. జైలులో ఈ దిశగా పరివర్తన పొందాలని అన్నారు. జైలు పర్యవేక్షకులు పోచా వరుణారెడ్డి, జైలర్ వి.రమేష్, జైలు సివిల్ అసిస్టెంట్ సర్జన్ బ్రహ్మ తేజ, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు

విశాలాంధ్ర ఒంగోలు : అహింస అనే ఆయుధంతో స్వాతంత్ర్యం సాధించిన మహాత్మాగాంధీ చూపిన మార్గం మనందరికీ అనుసరణీయమని జిల్లా కలెక్టర్ .ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. మహాత్మాగాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఒంగోలు గాంధీరోడ్డులోని గ్రామచావడి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఏ.ఎస్.పి. కే.నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యే శ్రీ.బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు, అధికారులతో కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దక్షిణాఫ్రికాలో వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గాంధీ మన దేశానికి వచ్చి అహింస, సహాయ నిరాకరణ వంటి విధానాలలో పోరాటం చేసి మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారన్నారు. ఆయన చూపిన అహింస, సత్యాగ్రహం వంటి విధానాలు నేడు మనందరికీ అనుసరణీయ మార్గాలుగా మారాయన్నారు. గాంధీజీ ఆశయ స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల నకిలీ స్టాంపు పేపర్లతో భూకబ్జాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూశాయని, ఇలాంటి కేసులలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజం సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన సాగుతోందన్నారు. గ్రామ,వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేసిందన్నారు. ప్రశాంతంగా ఉంటున్న ఒంగోలులో భూకబ్జాలకు పాల్పడుతూ కొందరు అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు చెప్పారు. చైర్ పర్సన్ మరియు మేయర్ మాట్లాడుతూ గాంధీజీ జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ అధికారి శ్రీ శౌర్య మన్ పటేల్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, తహసిల్దార్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష



విశాలాంధ్ర కనిగిరి: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా, చంద్రబాబుపై జగన్ సర్కార్ పెట్టిన తప్పుడు కేసులను ఖండిస్తూ సోమవారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పించారు.మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రాజమండ్రి జైలులో చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా టిడిపి శ్రేణులతో సత్యమేవ జయతే నిరాహార దీక్షను చేపట్టారు. ఉగ్ర మాట్లాడుతూ వైసిపి రాక్షస పాలనపై శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. వైసీపీ అనుబంధ సంస్థలాగా సీఐడీ విభాగం పనిచేస్తుందని ఆరోపించారు. రాజస్థాన్ నుంచి తిరుపతి వెళ్తున్న రాజస్థానీయులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావంగా దీక్షలో పాల్గొని మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, పిచ్చాల శ్రీనివాసులు రెడ్డి, ఫైక్ బారామము , షేక్ ఫిరోజ్ ,అహ్మద్, వాజిథా, ముత్తిరెడ్డి వెంకట రెడ్డి, కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్ రెడ్డి, గవదకట్ల హరికృష్ణ, మీనిగా కాశయ్య ఏనీమాల కొండయ్య,మన్నేపల్లి శ్రీనివాసులు,అమీర్ జాన్, యారవ ప్రసాద్ రెడ్డి, రాహుల్ యాదవ్ పార్వతి, దొరసాని, స్వప్న, ధనలక్ష్మి, తులసి, చిరంజీవి, బేరి పుల్లారెడ్డి, షరీఫ్, గౌడ్, గుడిపాటి ఖాదర్, వెన్నా శ్రీను, రీటా ఫయజ్, అహ్మద్, మ రిజ్వాన్, సుభాని, లక్ష్మయ్య, జాన్సన్, నజీముద్దీన్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీలో కానుకలను చోరీ చేసిన పూజారి నరసయ్య సస్పెండ్

విశాలాంధ్ర సిఎస్ పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో హుండీలోని డబ్బులు చోరీ చేసిన పూజారి నర్సయ్యని సస్పెండ్ చేసినట్టు నారాయణ స్వామి దేవస్థానం ఈవో జి రమణారెడ్డి తెలిపారు శ్రీ నారాయణ స్వామి దేవస్థానంలో పూజారిగా పనిచేస్తున్న నరసయ్య నారాయణస్వామి దేవస్థానంలో గత నెల 18వ తేదీన ప్రధాన హుండీలో చోరీ చేస్తున్న వీడియో సిసి కెమెరాలో రికార్డు అయ్యింది ఆ వీడియో బయటకి రావడంతో వెంటనే జిల్లా దేవాదాయశాఖ అధికారులు పూజారి నర్సయ్యను తక్షణమే విధుల నుండి తొలగించినట్లు దేవస్థానం కార్యనిర్వహికారి జి రమణారెడ్డి సోమవారం తెలిపారు అయితే పూజ నరసయ్య ప్రధాన హుండీలో చేతులు పెట్టి భక్తులు వేసిన కానుకలను ఎంత మొత్తం చోరీ చేశాడు తెలియాల్సి ఉంది మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి దేవస్థానంలో పూజారి చోరీ చేయడం ప్రజలు భక్తులు ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోంది

- చంద్రబాబు నాయుడు అరెస్టు హేయం
- పది సంవత్సరాలుగా ముఖ్యమంత్రి బెయిల్ పై ఎలా బయట తిరుగుతున్నాడో చెప్పాలి
- ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కటమే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన
- సత్యమేవ జయతే దీక్షలలో టిడిపి, జనసేన, వామపక్ష పార్టీల నాయకుల ధ్వజం

విశాలాంధ్రం - ఒంగోలు : రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైసీపీ ప్రభుత్వం పై ప్రతిపక్ష పార్టీల నాయకులు ధ్వజమెత్తారు. రాజమండ్రిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి నిరాహార దీక్షకు మద్దతుగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం, జనసేన, సిపిఐ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరాహార దీక్ష లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడును ఎటువంటి ఆధారాలు లేకుండా, రాజకీయ కక్షలతో అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. జగన్ ప్రజా సమస్యలను గాలికి వదిలి కేవలం రాజకీయ కక్ష సాధింపులతో పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు పై పెట్టిన కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు కు నిరసనగా ఈరోజు తెలుగుదేశం పార్టీతో కలిసి నిరాహార దీక్షలో పాల్గొన్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అమలు కావటం లేదన్నారు. కనీసం నిరసన తెలిపే హక్కును కూడా జగన్ హరిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలినేని కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఎన్నో బందులు, నిరసనలలో పాల్గొన్నారన్నారు. అప్పటి అధికార ప్రభుత్వం బాలినేని పై ఎన్ని కేసులు పెట్టారో చెప్పాలన్నారు. అలాగే జగన్ పాదయాత్ర సందర్భంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఏమైనా కేసులు పెట్టారా అని ప్రశ్నించారు. అయితే జగన్ ప్రభుత్వం మాత్రం ప్రతిపక్షాల గొంతు నొకటమే లక్ష్యంగా పాలన సాగిస్తుందన్నారు. రానున్న ఎన్నికలలో ఇరు పార్టీలు కలిసి పోటీ చేస్తాయన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరు ప్రకాష్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు వైసీపీని బంగాళాఖాతంలో కలుపుతారన్నారు. కార్యక్రమం అనంతరం టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎస్ డి సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరం సర్పంచ్ కు పితృవియోగం.

- పలువురు నివాళులు.
- పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీలు.

విశాలాంధ్ర తాళ్లూరు:- మండలంలోని లక్కవరం గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు తండ్రి సోమవారం అనారోగ్య కారణంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జడ్పిటిసి మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తదితరులు లక్కవరం గ్రామంలో ఆయన పార్థివ దేహం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ వెంకటేశ్వర్లుకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు .ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ తూము వెంకట సుబ్బారెడ్డి, ఎంపీటీసీ కోటేష్, గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర దర్శి:- దర్శి పట్టణం లోని సాయి వృద్ధాశ్రమంలో వృదులకు నిత్య అన్నదానం చేస్తున్నారు నిర్వాహకులు దాతల సహకారంతో వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. సోమవారం గోపిరెడ్డి జ్ఞాపకం పండ్లు పంచిపెట్టారు వారి కుటుంబ సభ్యులు నిర్వాహకులు పాల్గొన్నారు. రోగులకు పండ్లు పంపిణీ మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా సోమవారం వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గవర్నమెంట్ హాస్పటల్లో రోగులకు, వాసవి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్ అందజేశారు. ఈ కార్యక్రమానికి వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లా గవర్నర్ వెలుగురి చంద్రశేఖర్ , వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ కోటా సుధారాణి, మునగా ఉమా శివలక్ష్మి, కొలిపాకుల వరలక్ష్మి, బచ్చు వెంగళరావు, తాళ్లూరి చెంగాలయ్య, కొలిపాకుల ఇతర సభ్యులు పాల్గొన్నారు.

హెయిర్ తో గాంధీజీ చిత్రపటం.

విశాలాంధ్ర తాళ్లూరు :- అందరిలాగా కాకుండా ఒక వినూత్న రీతిలో గాంధీజీ చిత్రపటాన్ని గీయాలి అనుకుంది పదవ తరగతి విద్యార్థిని కె అంజన. మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో గల గీతాంజలి హై స్కూలు నందు పదవ తరగతి చదువుతున్న కే అంజన హెయిర్ తో గాంధీజీ చిత్రపటాన్ని తయారు చేయాలనుకుంది. దీనికి సహ విద్యార్థినిలు వి శశికళ, యస్ భవ్య తోడు కావడంతో ఆ పనిని పూర్తి చేసింది. కే అంజన గాంధీజీ చిత్రపటాన్ని తయారు చేయగా శశికళ తన హెయిర్ కత్తిరించి, భవ్య సహాయంతో చిత్రపటాన్ని తయారు చేశారు. దీనిని పాఠశాలలో ప్రదర్శించగా పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపాల్ యాతం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారిని ప్రశంసించారు.

9 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

విశాలాంధ్ర -కోనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 9 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు కొనకనమిట్ల మండలం తో పాటు పొదిలి ముళ్ళమూరు వెలిగండ్ల తార్లపాడు మండలాల నుంచి వచ్చిన మహిళలకు కుటుంబాలు నియంత్రణ ఆపరేషన్ చేశామన్నారు వారికి ప్రభుత్వం అందిస్తున్న పారితోషికాన్ని త్వరలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి సురేఖ స్టాఫ్ నర్సులు పద్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసన దీక్ష

విశాలాంధ్ర. సింగరాయకొండ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు వ్యతిరేకంగా సింగరాయకొండలో టీడీపీ పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి నాడునిరసన కార్యక్రమం చేపట్టారు. మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మురళి శెట్టి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు: మండల పరిధిలోని హనుమంతాపురం పంచాయతీ యువ నాయకుడు మురళి శెట్టి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి మరియు నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి పాల్గొని మురళి చేత కేక్ కటింగ్ నిర్వహించి అతనికి ఘనంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కత్తి కిషోర్, కత్తి తిరుపాలు, కొండం రాజు, లక్ష్మీనారాయణ, తేజ,శ్రీను,వెంకీ బ్రహ్మనాయుడు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి నివాళులర్పించిన ఉగ్ర

విశాలాంధ్ర కనిగిరి : జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమానులేసి నివాళులర్పించారు. గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. గాంధీ బోధనలు ప్రతి ఒక్కరి మార్గాన్ని ప్రకాశవంతం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ ఫిరోజ్, గుడిపాటి ఖాదర్, సద్గురు, వాజిదా, కోట సురేష్ బాబు, సానికొము తిరుపతిరెడ్డి, చిరంజీవి, బారే మామ్, రాచమల్ల శ్రీనివాస రెడ్డి, ఇంద్ర భూపాల్ రెడ్డి, పార్వతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తాతపూడి వారి ఆత్మీయ సమావేశం.

విశాలాంధ్ర-వెలిగండ్ల: తాతపూడి వారి ఆత్మీయ సమావేశం తూర్పు గోదావరి జిల్లా నిదవోల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో వెలిగండ్ల మండలం నుండి జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దేవ సహాయం, తాతపూడి సురేష్ బాబు ఆహ్వానితుల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా తాతపూడి దేవా, సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ తాతపూడి వంశం అంచలంచెలుగా ఎదగాలని అన్ని రంగాలలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వెలిగండ్ల నుండి పలువురు తాతపూడి వంశీకులు పాల్గొన్నారు.

సకాలంలో వర్షాలు -పంటలకు జీవకళ .

విశాలాంధ్ర- తాళ్లూరు:- సకాలంలో వర్షాలు కురిసి మంచి వర్షపాతం నమోదు కావడంతో పంటలకు జీవకళ లభించినట్ల యిందని మండల వ్యవసాయాధి కారి బి ప్రసాద్‌రావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన తాళ్లూరులోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవడం వల్ల సాగు ఖర్చులు కూడా తగ్గినట్లు అయిందని ఆయన అన్నారు. జూన్ నెల నుండి సెప్టెంబర్ నెల వరకు 408.12 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావలసి ఉండగా, 525.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయి అత్యధికంగా వర్షం కురిసి రబి సాగుకు ఎంతో దోహద పడినట్లుగా ఉందని ఆయన తెలిపారు. దీంతో రబీలో సాగు చేసే పంటలైన వరి, మొక్కజొన్న, మిరప ,కంది, చిరుధాన్యాల సాగులో ఈ వర్షపాతం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కొన్ని రకాలైన పంటలను వేయడంలో వర్షపాతం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు నాయక్, రైతులు పాల్గొన్నారు.